Thomas Chitta

ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లాను దేవుని గడప అంటారు. ఆ నీడలో 1954లో శౌరిరెడ్డి, అంతోనమ్మ దంపతులకు పుట్టారు చిత్తా థామాస్. ముద్దుగా టామ్ అని పిలుచుకున్నారు. పోరుమామిళ్ల, నెల్లూరు, కడపలో హైస్కూల్ పూర్తి చేసుకున్న టామ్.. తర్వాత ఆధ్యాత్మికత వైపు మళ్లారు. శిక్షణ తర్వాత 1980లో కాథలిక్ మత గురువుగా మారారు.

మానవసేవకు మించిన మాధవ సేవ ఏముంటుందన్న ఆలోచన టామ్‌లో దృఢసంకల్పంగా మారింది. మైదుకూరులో పేదరికం వల్ల చదువుకు దూరమయిన వారికి అండగా నిలవాలనుకున్నారు. అదే సమయంలో అమెరికాలో ఉన్నత విద్య అవకాశం వచ్చింది. అలా షికాగో వెళ్లిన టామ్‌కు మనసులో మాత్రం మైదుకూరే మెదులుతూ ఉండేది. మిత్రులను కలుపుకుని దాతలను సంప్రదించిన టామ్... సొంతగడ్డకు చేతి నిండా డబ్బుతో తిరిగొచ్చారు. పేద విద్యార్థుల పెదవులపై చిరునవ్వును వెలిగించారు. ఆ వెలుగులు మరిన్ని సేవా కార్యక్రమాలకు దారి చూపించాయి.

స్పాట్

మైదుకూరు, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలియో బారిన పడ్డ  చిన్నారుల కోసం నిర్మలా వికలాంగుల సేవానిలయం ఏర్పాటు చేశారు. భారతీయ సంస్కృతిలో ధ్యానానికి, తపోజీవనానికి, ఆశ్రమ జీవనానికి ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా కడప జిల్లా పెన్నా నది తీరంలో ఆనందాశ్రమం నిర్మించారు. 2000 సంవత్సరంలో అక్కలరెడ్డిపల్లెలో.. చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌తో పాటు సెయింట్ జేవియర్ వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేశారు థామస్. ఇక 2002లో టామ్‌కు జీవిత భాగస్వామిగా వచ్చిన గీత అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని ఏటిపల్లి వాసి. డాక్టర్ చదివిన గీత 17ఏళ్ల వయస్సులో బెంగళూరులో మదర్ థెరిసాను కలిసిన స్ఫూర్తితో సేవా మార్గం పట్టారు.

ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ అనే సంస్థ ద్వారా ఏటా పది వేల మంది విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్నారు గీత. మరో రెండున్నర వేల మందికి ఏటా 14 వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్స్ అందిస్తున్నారు.

చిన్నారులకు ఉచితంగా గ్రహణమొర్రి ఆపరేషన్లు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు చేయూతనివ్వడం, పల్లెటూరి మహిళల కోసం మొబైల్ క్లినిక్, లేడీస్ హెల్త్ పేరుతో పుస్తకాల పంపిణీ ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో. మూడున్నర దశాబ్దాల వీరి సేవకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. 2014లో ఫిలడెల్ఫియాలో జరిగిన కన్వెన్షన్‌లో అమెరికన్ తెలుగు అసోసియేషన్ అవార్డు, 2015లో నార్త్ అమెరికన్

తెలుగు అసోసియేషన్ అవార్డు, 2016లో అమెరికాలోని బ్లూమింగ్‌టన్‌లో స్మైల్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ అవార్డు వచ్చాయి. ఒకటి కాదు రెండు కాదు.. దాదాపు 15ఏళ్లుగా ఏటా 8 కోట్ల బడ్జెట్‌తో ఈ సేవాయజ్ఞం సాగిస్తూ వేలాది మందికి అండగా నిలుస్తున్నారు టామ్ దంపతులకు సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2016 తెలుగు ఎన్‌ఆర్‌ఐ ఆఫ్ ద ఇయర్ అవార్డుతో సత్కరిస్తోంది సాక్షి.